teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 155 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 30 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## తొలి విడత నామినేషన్ల పర్వం పూర్తి

సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం ఏకగ్రీవం

నేటి నుంచి రెండో విడత నామినేషన్లు




05

## బీఆర్ఎస్ దీక్షా దివస్ నాటకాలు

### కేసీఆర్ దీక్ష గుట్టు నిమ్మరసానికి ఎరుక

దోచుకున్న డబ్బుతో ఎన్ని కార్యక్రమాలైనా చేస్తారు

బీఆర్ఎస్ విమర్శలపై మంత్రి సీతక్క ఫైర్




హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ హయంలో నమోదైన కేసు విచారణ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. కరోనా ట్రీట్మెంట్ ను ఆరోగ్య శ్రీలో చేర్చాలన్నందుకు బీఆర్ఎస్ హయంలో తమ మీద కేసు నమోదైందని వివరించారు. ఇందిరా పార్క్ వద్ద శాంతియుత దీక్ష చేసినందుకు బీఆర్ఎస్ హయంలో తమ మీద కుట్ర పూరితంగా

మిగతా 2 లో




## ఇందిరమ్మ చీరల పంపిణీకి బ్రేక్


ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేత

మూడు విడతలుగా లోకల్ బాడీ ఎన్నికలు

డిసెంబర్ 11, 14, 17 న పోలింగ్

02





# చలి పంజా



## తెలంగాణలో పెరగనున్న చలి



02

### అకస్మాత్తు మార్పులకు కారణం దిత్వా తుఫాన్

వర్ష ప్రభావం కంటే చలి తీవ్రత పెరిగేందుకే అవకాశం... వాతావరణ శాఖ వెల్లడి

తెలంగాణలో తీవ్రమైన చలి ఉండగా.. మధ్యలో నాలుగైదు రోజులు ఆ ప్రభావం కాస్త తగ్గింది. కానీ మళ్లీ గురువారం నుంచి రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పల్లె, పట్నం అనే తేడా లేకుండా జనాలు వణికిపోతున్నారు. మరి ఈ అకస్మాత్తు మార్పులకు కారణం ఏంటంటే దిత్వా తుఫాన్. బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తుఫాన్ ప్రభావం వల్ల తెలంగాణలో రెండు రోజుల పాటు చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.



## ఓటీటీలో వచ్చే ప్రతీ సినిమాను రికార్డింగ్ చేశా

ఆడియోలు, వీడియోల క్వాలిటీకి ఔట్‌సోర్సింగ్ ఒప్పందం

ముగిసిన "ఐబొమ్మ రవి" రెండో విడత కస్టడీ

విచారణలో సంచలన విషయాలు వెల్లడించిన రవి

.. వివరాలు 2లో




## గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకల్లో డ్రోన్ షో

గిన్నిస్ రికార్డు లక్ష్యంగా 3,000 డ్రోన్లతో ప్రదర్శన

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

.. వివరాలు 2లో



## నగరంలో తొలి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్

కేబీఆర్ పార్క్ వద్ద నేటి నుంచి ప్రారంభం

72 కార్లు పార్కింగ్ చేసుకునే సదుపాయం

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు

హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్ అందుబాటులోకి రానుంది. నేటి (ఆదివారం) నుంచి కేబీఆర్ పార్క్ వద్ద ప్రారంభించనుంది జీహెచ్ఎంసీ. ఇప్పటికే మల్టీ లెవెల్ పార్కింగ్‌కు ట్రయల్ రన్ పూర్తి చేసింది. నగరంలో ఇదే మొదటి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్. జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్ అందుబాటులోకి తీసుకువచ్చింది జీహెచ్ఎంసీ. ఇప్పటికే మల్టీ లెవెల్ పార్కింగ్‌కి ట్రయల్ రన్ పూర్తి చేశారు. ఉదయం, సాయంత్రం

మిగతా 2 లో

## ఈసీఎల్ నెట్ యాప్‌పై సలహాలు ఇవ్వండి

### ఎన్నికల కమిషన్ నుండి కీలక పిలుపు

యాప్‌ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా మార్చేందుకు ఆహ్వానం




న్యూ ఢిల్లీ, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఎన్నికల కమిషన్ అన్ని పౌరులను ఈసీఎల్ నెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, యాప్‌ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా మార్చడానికి వారి సూచనలను అందించమని ఆహ్వానించింది. వచ్చే నెల 27 వరకు యాప్‌లోని సలహాను సమర్పించు ట్యాబ్‌ను ఉపయోగించడం ద్వారా పౌరులు

మిగతా 2 లో




## డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసం

భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యం

నకిలీ పోలీస్‌ల స్కామ్‌పై ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాలు హైదరాబాద్‌లో

మిగతా 2 లో

## గులాంల ఎగురులాట కొంత కాలమే

కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

ఎదురుదాడి ఎలా చేయాలో కేసీఆర్‌కు తెలుసు

దీక్షా దివస్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీర్ విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): కొందరు మూరులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 2 లో



## తెలంగాణలో విద్యుత్ డిమాండ్

- ప్రస్తుతం రాష్ట్ర ఉత్పత్తి సామర్థ్యం 24,769 మెగావాట్లు
- 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం
- సరఫరాపై ఉపముఖ్యమంత్రి భట్టి సమీక్ష
- గ్రీన్ ఎనర్జీ వినియోగంలో వెనుకబాటుపై ఆందోళన
- భవిష్యత్తు అవసరాల కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం

02

## వాట్సాప్, టెలిగ్రామ్‌లకు కేంద్రం కీలక ఆదేశాలు



- సిమ్ కార్డ్ ఉంటేనే యాప్ పనిచేయాలి
- 90 రోజుల్లోగా అమలు చేయాలని ఆదేశం
- సైబర్ నేరాల నివారణకు కేంద్రం కఠిన చర్యలు
- టెలికమ్యూనికేషన్స్ శాఖ సూచన

02

# చలి పంజా



తెలంగాణ బ్యూరో, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో తీవ్రమైన చలి ఉండగా.. మధ్యలో నాలుగైదు రోజులు ఆ ప్రభావం కాస్త తగ్గింది. కానీ మళ్లీ గురువారం నుంచి రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పల్లె, పట్నం అనే తేడా లేకుండా జనాలు వణికిపోతున్నారు. మరి ఈ అకస్మాత్తు మార్పులకు కారణం ఏంటంటే దిత్వా తుఫాన్. బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తుఫాన్ ప్రభావం వల్ల తెలంగాణలో రెండు రోజుల పాటు చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తెలంగాణలో మొన్నటి వరకు చలి కాస్త తగ్గింది. కానీ గురువారం నుంచి మళ్లీ చలి పంజా విసురుతోంది. అయితే వాతావరణంలో అకస్మాత్తుగా ఇలాంటి మార్పులు రావడానికి ప్రధాన కారణం వరుసగా ఏర్పడుతున్న తుఫానులు. అవును నిన్నటి వరకు సెన్యార్ తుఫాన్ తెలంగాణ మీద ప్రభావం చూపగా ఇప్పుడు దిత్వా తుఫాన్ దూసుకొస్తుంది. మరి తెలంగాణ మీద ఈ తుఫాన్ ప్రభావం ఎలా ఉండబోతుంది, వర్షాలు కురుస్తాయా, చలి పెరుగుతుందా అనే అంశాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. నైరుతి బంగాళాఖతాంలో శ్రీలంక సమీపంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గురువారం తుఫాన్‌గా మారింది. దీనికి దిత్వా అని పేరు పెట్టారు. ఈ తుఫాన్ ప్రభావం వల్ల తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వాతావరణ కేంద్రం తెలిపింది. నాలుగు రోజుల పాటు ఏపీ, తమిళనాడులో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. మరి తెలంగాణ మీద దిత్వా ప్రభావం ఎలా ఉండబోతుంది అంటే, ఈ తుఫాన్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసేందుకు పెద్దగా అవకాశం లేదని వాతావరణ కేంద్రం తెలిపింది. కాకపోతే రెండు రోజులు అంటే నవంబర్ 30, డిసెంబర్ 1న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది. దిత్వా తుఫాన్ వల్ల వర్ష ప్రభావం కంటే చలి తీవ్రత పెరిగేందుకే అవకాశం ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే గురువారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాత్రి పూట చలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా పల్లె, పట్నం తేడా లేకుండా గజ గజా వణికిపోతుంది. చాలా ప్రాంతాల్లో ఉదయం పూట పొగ మంచు దృశ్యాలే కనిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం అధికంగా ఉంది. అయితే దిత్వా తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నవంబర్ 29, 30 రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన చలి గాలులు వీస్తాయని అంచనా వేసింది. దిత్వా తుఫాను వల్ల డిసెంబర్ తొలి వారంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలో వర్షాలు కురిసినా చలి తీవ్రత తగ్గే సూచనలు కనిపించడం లేదని వెల్లడించింది. చలి ప్రభావం వల్ల వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలు, వ్యాధులతో బాధ పడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని మధ్యాహ్నం సమయంలోనే ఊర్ల ప్రయాణాలు పెట్టుకోవాలని సూచిస్తున్నారు. చలితోపాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

## ఓటీటీలో వచ్చే ప్రతీ సినిమాను రికార్డింగ్ చేశా



హైదరాబాద్, నవంబర్ 29(తీన్మార్ న్యూస్): ఐబొమ్మ రవి రెండో విడత కస్టడీ ముగిసింది. శనివారం నాటి విచారణలో ఐబొమ్మ రవి సంచలన విషయాలు వెల్లడించారు. ఓటీటీలో వచ్చే ప్రతీ సినిమాను రికార్డింగ్ చేసినట్లు అంగీకరించారు. సినిమా రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి కూడా పోలీసులకు వివరించారు. ఐబొమ్మ పూర్తి పేరు ఇంటర్నల్ బొమ్మగా పేర్కొన్నారు. అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలీగ్రామ్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం రవి ఈమెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. కస్టడీ ముగియడంతో మళ్లీ నాంపల్లి కోర్టుకు రవి తరలించారు.

## బీఆర్ఎస్ దీక్షా దివస్ నాటకాలు

మొదటి పేజీ తరువాయి

కేసు పెట్టారని అన్నారు. కరోనా టైంలో సామాన్య ప్రజల ఖరీదైన ట్రీట్‌మెంట్ చేసుకోలేరని ఆరోగ్య శ్రీ లో చేర్చాలన్నామని, పేద ప్రజల ప్రాణాల కోసమే ఇందిరాపార్క్ దగ్గర నిరహార దీక్ష చేసామని గుర్తు చేశారు. తాము చేసింది న్యాయ మైన పోరాటం అని, రాజకీయాల కోసం చేసిన దీక్ష కాదని స్పష్టం చేశారు. తమ తరపున న్యాయవాదులు నాగులూరి కృష్ణ కుమార్ గౌడ్, నరేందర్ కుర్మ, ఎస్ఎస్ రావు వాదనలు వినిపించారని తదుపరి విచారణను డిసెంబర్ 18 కు కోర్టు వాయిదా వేసిందని తెలిపారు. కోర్టుల మీద నమ్మకం ఉంది, విచారణకు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన ఉన్నామని, తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. అలాగే బీఆర్ఎస్ దీక్షా దివాస్ ను ఉద్దేశించి మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసే వాళ్లు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదు, అందుకే ఒక్క రోజుకి అప్పుడు దీక్షా దివస్ ను పరిమితం చేశారు. అధికారం పోయిన తర్వాత పది రోజులపాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడాల్సిన అవసరం ఏంటి.. ప్రజలను మోసగించేందుకు, అధికార పార్టీ నిర్మించేందుకు పది రోజులపాటు దీక్షా దివస్ నిర్వహిస్తారట.. ఇప్పుడు పది రోజులు డబ్బా కొట్టుకునేందుకు రెడీ అయ్యారు. ప్రజలకు పదేండ్లలో చేసిన అభివృద్ధి ఏంటో దీక్షా దివాస్ లో చెప్పాలి. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకి ఎంతో చేసింది. విజయాలను ప్రజలకు వివరించేందుకు మేము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. మా విజయోత్సవాలను అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారు అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ ఆకాంక్ష దశాబ్దాల నుండి ఉంది. కేసీఆర్ దీక్ష గుట్టు నిమ్మరసానికి ఎరుక. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమే. బీఆర్ఎస్ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. దోచుకున్న డబ్బులతో బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కార్యక్రమాలైనా చేస్తారు. మేం చెప్పినట్టే రాష్ట్ర ప్రజలు వినాలి అనేలా బీఆర్ఎస్ నాయకులు ప్రవర్తిస్తున్నారు. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం. లేకపోతే బయటకే రావొద్దని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు అని మంత్రి సీతక్క తెలిపారు.

## గులాంల ఎగురులాట కొంత కాలమే

మొదటి పేజీ తరువాయి



వ్యాఖ్యలు చేశారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని కానీ తాను ఇలానే మాట్లాడుతానని ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు విలన్లు కౌరవులు అని అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు.. శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు. సోనియా గాంధీకి అసెంబ్లీలో ధన్యవాదాలు తెలిపిన సంస్కారి కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్ష అయితే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విరమించమని చెప్పిందని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుందామని దీక్షా దివస్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హీరోలను విలన్లుగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్ర జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను బాంబులు పెట్టి కూల్చివేసే ప్రయత్నం జరిగిందన్నారు. గులాంల ఎగురులాట కొంత కాలమే వచ్చే కాలమంతా గులాబీలదే అంటూ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకల్లో "డ్రోన్" షో




హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 9న జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేలా డ్రోన్ షోను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఒకేసారి 3 వేల డ్రోన్లతో ఆకాశంలో Telangana is Rising.. Come, Join the Rise అనే అక్షరాల సమాహారం ఆవిష్కరించేలా డ్రోన్ షో నిర్వహించనున్నారు. ఇప్పటివరకు డ్రోన్లతో ఆకాశంలో అత్యంత పొడవైన వాక్యాన్ని ప్రదర్శించిన రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ అబుదాబీ పేరిట ఉంది. 2025 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2,131 డ్రోన్లతో Happy NewYear అనే వాక్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డును అందుకుంది. అంతకు మించిన సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించి గ్లోబల్‌సమ్మిట్ ముగింపు వేడుకల్లో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించనుంది. డ్రోన్ షోతో తెలంగాణ రైజింగ్ నినాదాన్ని గగనతలంలో ప్రదర్శించి ప్రపంచ రికార్డు అధిగమించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. కాగా, వికసిత్ భారత్-2047 జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. ఈ లక్ష్యాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు. ఈనెల 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలుస్తుంది.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసం




మొదటి పేజీ తరువాయి

కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కొరియర్ కంపెనీల అధికారులుగా నటిస్తూ కాల్ చేసే మోసగాళ్లు, మనీ లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యం. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తున్నారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ ఎఫ్ఐఆర్ లు, వన్-బైలబుల్ వారెంట్లు, ఆర్బీఐ లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయిస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, వాట్సాప్ లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ ఐడి లు స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. ఓటీపీ లు, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్‌ద్వారా మాత్రమే ధృవీకరించాలి. వాట్సాప్ మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలైన ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్, ఎక్స్ ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉంది. అప్రమత్తతే రక్షణ.. మీ డబ్బు, మీ డేటా, మీ భద్రత మీ జాగ్రత్తల్లోనే ఉంది.

## ఇందిరమ్మ చీరల పంపిణీకి బ్రేక్

హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఇందిరమ్మ చీరల పంపిణీకి బ్రేక్ పడింది. స్థానిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో చీరల పంపిణీని ఎన్నికల సంఘం అధికారులు నిలిపివేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 44 లక్షల చీరలను పంపిణీ చేసింది. మొత్తం కోటి చీరలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. కాగా, గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్లు స్వీకరిస్తుండటంతో రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. ఇటీవలనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి నూతనోత్తేజంతో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఈ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. లోకల్ బాడీ ఎన్నికల కోసం ఎప్పటి నుంచో అధికార పార్టీ రాజకీయ వ్యూహాలు, ప్రణాళికలు సిద్దం చేసుకుంటూ ఉన్నది. మూడు విడతలుగా జరగనున్న ఈ ఎన్నికల్లో తొలివిడత డిసెంబర్ 11న, 14న రెండో విడత, 17న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి.

## నగరంలో తొలి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్

మొదటి పేజీ తరువాయి

సమయంలో వాకింగ్‌కు వచ్చేవారితో పాటు చుట్టుపక్కల వారికి పార్కింగ్ పెట్టుకునే సదుపాయం కల్పించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను నిర్మించింది నవ నిర్మాణ్ అసోసియేట్స్. ఒకేసారి 72 కార్లను పార్కింగ్ చేసే సదుపాయం కల్పించింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ మోడల్‌లో మల్టీ లెవెల్ పార్కింగ్‌ను నిర్వహించనుంది నవ నిర్మాణ అసోసియేట్. ముందగానే పార్కింగ్ బుక్ చేసుకునేందుకు, నావిగేషన్, ఇతర సర్వీసుల కోసం ఒక మొబైల్ యాప్‌ను తీసుకురానున్నారు నిర్వాహకులు.

## ఈసీఎల్ నెట్ యాప్‌పై సలహాలు ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

దీన్ని చేయవచ్చు. యూజర్ సూచనలను పరిశీలిస్తామని మరియు ప్లాట్‌ఫామ్‌ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా మార్చడానికి మరింత అప్‌డేట్ చేస్తామని కమిషన్ తెలిపింది. ఈసీఎల్ నెట్ ప్లాట్‌ఫామ్ అధికారికంగా 2026 జనవరిలో ప్రారంభించాలని ప్రణాళిక చేయబడింది. ఈసీఎల్ నెట్ యాప్ యొక్క ట్రయల్ వెర్షన్‌ను బీహార్ అసెంబ్లీ ఎన్నికలు 2025 మరియు ఇటీవలి ఉప ఎన్నికల సమయంలో ఉపయోగించినట్లు పోల్ ప్యానెల్ తెలిపింది. ఈ కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ మెరుగైన ఓటరు సేవలను, పోలింగ్ శాతం ట్రెండ్‌లను వేగంగా అందుబాటులోకి తీసుకురావడానికి మరియు పోలింగ్ ముగిసిన 72 గంటల్లోపు ఇండెక్స్ కార్డులను ప్రచురించడానికి వీలు కల్పించింది, గతంలో ఈ ప్రక్రియకు చాలా వారాలు లేదా నెలలు పట్టింది. బీహార్ ఎన్నికల నుండి నేర్చుకున్న విషయాలు మరియు ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, పరిశీలకులు మరియు క్షేత్ర అధికారుల నుండి వచ్చిన అభిప్రాయాన్ని ప్లాట్‌ఫామ్ కార్యాచరణను మరింత మెరుగుపరచడానికి చేర్చబడుతున్నట్లు పోల్ ప్యానెల్ గుర్తించింది. ఈసీఎల్ నెట్ యాప్ అనేది పౌరుల కోసం మునుపటి 40 వేర్వేరు ఎన్నికల సంబంధిత అప్లికేషన్లు మరియు వెబ్‌సైట్‌లను అనుసంధానించే ఒకే, ఏకీకృత యాప్.

## తెలంగాణలో విద్యుత్ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ డిమాండ్‌ను తీర్చడానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ ఉంటేనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని భట్టి నొక్కి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతూ వస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక ఒకేసారి 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ నగరం గ్లోబల్ హబ్‌గా మారబోతోందని చెప్పారు. తెలంగాణను 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి ఏడాది విద్యుత్ వినియోగంలో 10 శాతం డిమాండ్ పెరుగుతుందని భట్టి అన్నారు. ఈ లెక్కన 2047 వరకు రాష్ట్రానికి లక్ష మెగావాట్లకు పైగా విద్యుత్ అవసరం ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 24,769 మెగావాట్లుగా ఉందని.. విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోకపోతే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు వస్తాయని భట్టి హెచ్చరించారు. పర్యావరణ ఒప్పందాలను ప్రస్తావిస్తూ, గ్రీన్ ఎనర్జీ వినియోగంపై భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. 2030 వరకు విద్యుత్ వినియోగంలో 50 శాతం గ్రీన్ ఎనర్జీ ఉండాలని పారిస్ అగ్రిమెంట్ చెబుతోందని.. 2070 వరకు పూర్తిగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించాలని అంతర్జాతీయ ఒప్పందం ఉందని చెప్పారు. అయితే సోలార్, థర్మల్, విండ్, స్టోరేజ్ వంటి అన్ని గ్రీన్ ఎనర్జీ విభాగాలలో తెలంగాణ వెనుకబడి ఉందని భట్టి విచారం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎన్నుకున్న పార్టీ నాయకులు

**పార్టీ అభ్యర్థిగా సభావట్ ఇస్రా**

**కట్టుబడిన మాటతో ఒకేఒక్క పేరును ఖరారు చేసిన పార్టీ**



వెంకటాపూర్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): శనివారం తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలమేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని ఇంచన్ చెర్వుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు కోమండ్ల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల నిమిత్తమై కాంగ్రెస్ పార్టీ సభావట్ ఇస్రాని అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిపాదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా సోదరీమణులు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమం



మేడ్చల్ జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆద్వర్యంలో గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఏమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణా రావు, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ మరియు జిల్లా తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విత్తన చట్టంపై అవగాహన కార్యక్రమం

**మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్**



కన్నాయిగూడెం, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): కన్నాయిగూడెంలో నూతన విత్తన చట్టం 2025 పై రైతులకు మరియు విత్తన డీలర్లకు అవగాహన కల్పించడం జరిగింది. అంతేకాకుండా కొత్త చట్టంలో చేయవలసిన మార్పుల గురించి రైతుల మరియు డీలర్ల నుండి అభిప్రాయాలను కూడా సేకరించడం జరిగింది, అంతేకాకుండా కొత్త చట్టం లో తెస్తున్న మంచి మార్పులను చెయ్యవలసిన అంశాలను మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ వివరించారు అవి

1. విత్తనం పై రైతుల హక్కుకు గుర్తింపు, రైతులు విత్తనాలను పండించవచ్చు, వాడుకోవచ్చు, రైతులకు అమ్ముకోవచ్చు. ఈ అంశాలకు ఈ చట్టం వర్తించదు.
2. అన్ని రకాల విత్తనాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే విత్తనాల రిజిస్టర్ లో నమోదు అయిన విత్తనాలను విక్రయించాలి.
3. విత్తనాల ప్రమాణాలను ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఆ ప్రమాణాలను పాటించిన విత్తనాలనే అమ్మాలి.
4. విత్తనాలను ఉత్పత్తి చేసేవారు, డీలర్లు, సరఫరాదారులు, నర్సరీ నిర్వాహకులు లైసెన్స్ తీసుకోవడం తప్పనిసరి.
5. విత్తనాల ప్యాకెట్ పై క్యూఆర్ కోడ్, ధర, నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పేర్కొనాలి.
6. నకిలీ విత్తనాలు, నాణ్యతలేని విత్తనాలు అమ్మిన, చట్టం నిర్దేశించిన నియమాలు పాటించకున్నా పది వేల నుండి మూడు లక్షల రూపాయల జరిమానా మరియు మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చు.
7. అధికారాలు అన్ని కేంద్రం చేతిలో ఉంటాయి. రాష్ట్రాల అధికారాలు పరిమితం.
8. అత్యవసర పరిస్థితులలో తప్ప విత్తనాల ధరలను నిర్ణయించే అధికారం ప్రభుత్వాలకు లేదు.
9. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాల వలన రైతులకు నష్టం జరిగితే నష్టపరిహారం ఇచ్చే నియమాలు పాత చట్టం లో లేవు.
10. సాంప్రదాయ విత్తనాల రక్షణ కోసం నియమాలు లేవు.
11. విదేశాలలో ఉత్పత్తి చేసిన విత్తనాలను మన దేశంలో విక్రయించడానికి అనుమతి.
12. విత్తనాలను సాగు చేసే రైతులకు రక్షణలు లేవు.
13. విత్తనోత్పతి గురించి అంశాలను కొత్త చట్టం లో అవకాశం కల్పించడం

ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాణి, మండల డీలర్లు, రైతులు పాల్గొన్నారు

# 2వ విడత ఎన్నికల నోటిఫికేషన్ 30లోగా జారీ చేయాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ 2వ విడత ఎన్నికలు నిర్వహణకు 30వ తేది ఆదివారం ఉదయం 10.30 గంటల లోపు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం 2వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు నోటిఫికేషన్, అనంతరం 30వ తేది నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. 2వ విడతలో చిట్యాల మండలంలో 26 గ్రామ పంచాయతిలకు, 218 వార్డులకు, టేకుమట్ల మండలంలో 25 పంచాయతిలకు, 198 వార్డులకు, భూపాలపల్లి మండలంలో 26 గ్రామ పంచాయతీలకు, 216 వార్డులకు, అదేవిధంగా పలిమెల మండలంలో 8 గ్రామ పంచాయతిలకు 62 వార్డులకు మొత్తం నాలుగు మండలాలలోని 85 గ్రామ పంచాయతీలకు,694 వార్డులలో ఎన్నికలు నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంగం మార్గదర్శకాల. మేరకు నోటిఫికేషన్, నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. నోటిఫికేషన్ గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామంలోని ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేయాలని, అలాగే ఓటరు జాభితా నోటీస్ బోర్డులో పెట్టాలని సూచించారు.

నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు నియమించిన ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టి, ఎంసిసి టీములు పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లాలో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించి 24, 48, 72 గంటల నివేదికకు ఎంపీడీవోలు ధ్రువీకరణతో నివేదిక అందచేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ప్రజలు పిర్యాదు చేసేందుకు వీలుగా కలెక్టరేట్ నందు 24 గంటలు పనిచేసేలా 9030632608 సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద నామినేషన్ ఫారాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు.

# ఎన్నికల సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పర్యటన





రేగొండ, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి తెలిపారు. శనివారం రేగొండ మండలంలోని పలు గ్రామ పంచాయతిలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా రేగొండ, రంగయ్యపల్లి, దమ్మన్నపేట, మొగుళ్లపల్లి, రంగాపూర్, రూపిరెడ్డిపల్లి చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని నిశిత పరిశీలన చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలను, నామినేషన్‌ల స్వీకరణ విధానాన్ని సమీక్షించారు. ఆర్.ఓ, ఏఆర్.ఓ.లతో మాట్లాడి నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ, అభ్యర్థులకు అందించే మార్గదర్శకాలపై సూచనలు ఇచ్చారు. తదుపరి పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఎఫ్ ఎస్ టి బృందాలతో మాట్లాడి ఇప్పటివరకు టీము చేసిన తనిఖీలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, చేపట్టిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో పటిష్ట పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని అధికారులకు సూచించారు.

# రైతులతో అభిప్రాయ సేకరణ సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి, నకిలీ విత్తనాలపై నిషేధం విధించడానికి, విత్తనాల దిగుమతిని సరళీకరించడానికి మరియు రైతు హక్కులను రక్షించడానికి నూతన విత్తన చట్టం ముసాయిదా ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదాపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పోలీస్, ఉద్యాన, విత్తన కంపెనీలు, ఇన్పుట్ డీలర్లు, రైతుల ఉత్పత్తి సంఘాలు అనుబంధ సంస్థలు, రైతులతో అభిప్రాయ సేకరణ చర్చా సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. నూతన విత్తన చట్టం%-%2025 రైతులు సలహాలు, సూచనలు అందించాలని ఆయన సూచించారు.భారత ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా పై చేయవలసిన మార్పులు, చేర్పులపై రైతులు, విత్తన డీలర్లు, ఇన్పుట్ డీలర్లు, రైతు సంఘాలు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్య ప్రక్రియల సరళీకరణ, నిబంధనల ఉల్లంఘన జరిగినపుడు కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. నాణ్యత నియంత్రణ చర్యలు వంటి అంశాలను ఈ చట్టంలో స్పష్టంగా ఆయన పొందుపరిచినట్లు వివరించారు. పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదించడానికి ముందు, రైతులు, ఎన్‌జీఓలు, రైతు సంఘాలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి, వాటిని ముసాయిదాలో పొందుపరిచి ఆమోదం తర్వాతే ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ఈ ప్రతిపాదిత చట్టంలో మొత్తం 10 అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయి అని కలెక్టర్ వివరించారు. 1966 విత్తన చట్టంలోని లోపాలను సవరించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన చట్టం రూపొందించబడినట్లు చెప్పారు.

ఇలాంటి కీలక చట్టంపై ప్రతి రైతు తమ అభిప్రాయాలు, సూచనలు తప్పక తెలియజేయాలని కోరుతూ, అందుకున్న సూచనలను ప్రభుత్వంకు సమగ్ర నివేదికగా పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ నరేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఉద్యాన వన అధికారి సునీల్ కుమార్, మహదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి



సంగెం, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ లోకి చేరుతున్నారు. శనివారం సంగెం మండలం పల్లారి గూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అనంతరం వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు తప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలతో మమేకమై, అభివృద్ధి పథంలో ముందుకు సాగిస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల విశ్వాసంతో బిఆర్ఎస్, బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి అని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల అభ్యున్నతికి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతి వర్గానికీ నచ్చుతున్నాయి అని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే, కొత్తగా చేరిన కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ పాత, కొత్త లేకుండా అందరూ కలిసి కట్టుగా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారిలో పోడేటి రాజు, జన్ను సురేష్, జక్కుల హరీష్, మధు, శంకర్, ప్రవీణ్ ప్రశాంత్, తరుణ్, సతీష్, రాజు, మురళి, శ్రీకాంత్ తదితరులు చేరారు.

# ఘనంగా ముగిసిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన

## తరగతి గదే ప్రయోగశాల కావాలి

## ఆర్జెడి సత్యనారాయణరెడ్డి



వరంగల్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా స్థాయి ఇన్స్పైర్ మరియు బాల వైజ్ఞానిక ప్రదర్శన ఉర్సుగుట్టలోని తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ప్రదర్శనలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు తమ సృజనాత్మక శాస్త్రీయ మోడళ్ళను ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ రెడ్డి హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక ప్రపంచంలో శాస్త్రవిజ్ఞానం పాత్ర అమోఘమని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరిశోధనాశక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యం, సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. శాస్త్రీయ ఆలోచనలు ఉన్న విద్యార్థులు రానున్న తరాల అభివృద్ధికి మార్గదర్శకులవుతారని భావించారు. కార్యక్రమం కన్వీనర్ డిఇఓ రంగయ్య నాయుడు ప్రసంగిస్తూ, శాస్త్రీయ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. గురువుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల ప్రతిభ కలిసినప్పుడే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, వార్షికంగా నిర్వహించే ఇన్స్పైర్ మరియు బాల వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను వెలికితీస్తాయని చెప్పారు. ఈసారి ప్రదర్శనలో పాల్గొన్న మోడళ్ల నాణ్యత అత్యుత్తమంగా ఉందని అభినందించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో వరంగల్ జిల్లా అత్యధిక స్థాయిలో ప్రతిభ కనబరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రదర్శనలో ఉత్తమ ఎగ్జిబిట్లు మరియు ప్రాజెక్టు లకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందిన విద్యార్థుల పేర్లను ప్రకటించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, అధ్యాపకులు, వివిధ కమిటీ సభ్యులు, విద్యార్థులు వందలాదిగా పాల్గొన్నారు. ఇన్స్పైర్ మనక్ ప్రదర్శనలో జిల్లా స్థాయికి 164 ఎంపిక కాబడ్డాయి. వీటి నుండి పది శాతం అనగా 16 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఈరోజు ఎంపిక చేశారు. ఆర్బివిపి సైన్స్ ఎగ్జిబిషన్లో ఏడు థీంల నుండి జూనియర్ మరియు సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్లాస్టిక్ ను నివారించడం ఎలా అనే అంశంపై జరిగిన సెమినార్లో తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి మునజా హఫియా ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

ఈరోజు ప్రదర్శనను 9000 మంది విద్యార్థులు తిలకించారు. మూడు రోజులపాటు 19,000 మంది విద్యార్థులు, సందర్శకులు సందర్శించారు. యూనివర్సిటీ, వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ లు జడ్జిలుగా వ్యవహరించారు. విద్యార్థులు ప్రదర్శించిన విభిన్న ఎగ్జిబిట్లు ఆసక్తికరంగా ఉన్నాయి. కార్యక్రమంలో అతిథులుగా జిల్లా సెక్టోరియల్ అధికారులు ఉంద్రాతి సుజన్ తేజ, డిసిఇబి సెక్రెటరీ గారె కృష్ణమూర్తి, ఖిలా వరంగల్ ఎంఈఓ బి ప్రసాద్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వంశీ ,వరుణ్, రాహుల్, తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ జె వెంకటేశ్వరరావు, ట్రస్మా రాష్ట్ర సలహాదారు కె. భూపాల్ రావు, నాయకులు డి.రాంమూర్తి, వదుప్సా బాధ్యులు బిల్ల రవి,ఆడెపు శ్యామ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు,18 కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా టి. శ్రీధరాచార్యులు వ్యవహరించారు. జిల్లాస్థాయి ఇన్స్పైర్ ముగింపు కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి కె. అనన్య చేసిన శాస్త్రీయ నృత్యం మరియు కొంకపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన రఘుకుల తిలకా రామా కోలాటం,జల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల నృత్యం,తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల నృత్యం , సమ్మక్క సారలమ్మ ద్విపాత్రాభినయం చాలా ఆకట్టుకుంది.

# విత్తన ముసాయిదా చట్టంపై అభిప్రాయ సేకరణ సమావేశం



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): వ్యవసాయ శాఖ అధ్వర్యంలో విత్తన ముసాయిదా చట్టం.2025 పై అవగాహన కల్పించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన విత్తన డీలర్లు ఫార్మర్ ప్రొడ్యూసర్, ఆర్గనైజేషన్ సభ్యులు మరియు వ్యవసాయ శాఖ అధికారులతో చర్చ గోష్టి నిర్వహించారు. ఇందులో భాగంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ సీడ్ యాక్ట్ 1966 మరియు సీడ్స్ కంట్రోల్ ఆర్డర్ 1983 ను భర్తీ చేయడానికి డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు 2025 ప్రతిపాదించబడిందని నాణ్యమైన విత్తనాలు నాటే పదార్థాల ఉత్పత్తి విక్రయం సరఫరాను నియంత్రించడానికి ఈ బిల్లు ఉద్దేశించబడిందని, రైతులకు నాణ్యమైన ప్రమాణాలు గల విత్తనాలు అందేలా చూడడం నకిలీ నాసిరకం విత్తనాల విక్రయాన్ని అరికట్టే చర్యలు తీసుకునేలా చేస్తుందని విత్తనాల దిగుమతులను సడలిస్తూ రైతుల హక్కులను రక్షించడానికి కూడా ఈ బిల్లు ఉద్దేశించబడిందని నిర్వాహణ పరంగా సులభ వ్యాపార వాతావరణం, నేరాలకు పాల్పడినట్లయితే కఠినమైన శిక్షలు అమలు చేయబడతాయని తెలిపారు. ఈ బిల్లుపై అభిప్రాయాలు సూచనలు స్వీకరించడానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెబ్సైట్లో ముసాయిదా ఉంచబడిందని అన్నారు. డ్రాఫ్ట్ సి బిల్లు 2025 యొక్క ప్రధాన మార్పులు విత్తన రకాల నమోదు రైతుల సాంప్రదాయ రకాలు మరియు ఎగుమతి కోసం మాత్రమే ఉన్న రకాలను మినహాయించి అన్ని వాణిజ్య విత్తనాలకు నమోదు తప్పనిసరని 1966 చట్టంలో నోటిఫైడ్ చేసిన రకాలు ఆటోమేటిక్ గా నమోదు చేయబడతాయని వ్యాపార సంస్థల నమోదు విత్తన ఉత్పత్తిదారులు మాత్రమే కాదు ప్రొడ్యూసర్స్, డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్, నర్సరీస్ లు కూడా తప్పనిసరిగా నమోదు కావాలని విత్తనాలు సరఫరా ప్యాకెట్ మీద వాటి యొక్క పూర్తి వివరాలను పొందుపరచాలని క్యూఆర్ కోడ్ ఉండాలని నాణ్యత ప్రమాణాలు సర్టిఫికేషన్ ఉండాలని దిగుమతులకు అనుమతించిన నియంత్రణ వ్యవస్థకు లోబడి ఉంటుందని నేరాలకు పాల్పడిన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రొడ్యూసర్లకు 30 లక్షల వరకు పెనాల్టీ మరియు మూడు సంవత్సరాల శిక్షాకాలం వరకు జైలు శిక్ష ఉంటుందని రైతులు తమ పొలంలో పండించిన విత్తనాలు ఉంచుకోవడం, నాటుకోవడం అమ్ముకోవడం లాంటి హక్కులుంటాయని అన్నారు.

(బ్రాడ్ పేరుతో అమ్ముకోకూడదు). ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయనిర్మల కె వి కే సైంటిస్ట్ దిలీప్, మరిపెడ ఏ.డి.ఏ విజయ్ చంద్ర, మహబూబాబాద్ ఏ డి.ఏ శ్రీనివాస్ వివిధ గ్రామాల కు చెందిన విత్తన డీలర్లు, మండల అగ్రికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను వేలం వేయడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నికల్లో నామినేషన్ సమయంలో బెదిరింపులు, దౌర్జన్యం, లంచాలు, సర్పంచ్/వార్డు పదవులకు ఏకగ్రీవాలకు వేలం వంటి అనైతిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 171-%ూ% ప్రకారం ఎన్నికలలో అక్రమ ప్రవర్తనలు, సెక్షన్ 171-%దీ% ప్రకారం లంచగొండితనం, సెక్షన్ 171-%జ% ప్రకారం ఓటర్లపై అనుచిత ప్రభావం లేదా బెదిరింపులు ఎన్నికల నేరాలుగా పరిగణించ బడతాయని తెలిపారు. వీటికి సెక్షన్ 171-%జు% మరియు 171-%ఖీ% ప్రకారం ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు, అలాగే అనైతిక చర్యలకు పాల్పడిన వారు

ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అవుతారని తెలిపారు. పదవులను వేలం వేయడం, లంచగొండితనం, అనుచిత ప్రభావం వంటి ఎవరైనా నామినేషన్ లేదా ఉపసంహరణ సమయంలో అడ్డంకులు సృష్టించినా, బెదిరింపులు చేసినా, డబ్బు లేదా ఇతర ప్రలోభాలకు గురిచేసిన లేదా పదవులను వేలం వేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలియజేశారు. అలాగే సంబంధిత ఎన్నికల అధికారులు ఇలాంటి చర్యలపై నిఘా ఉంచాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలను ఖచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు భయపడకుండా, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

## జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



ములుగు జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కొరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా కార్యదీక్షతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రతి విషయంలో అత్యంత జాగ్రత్త పాటించాలన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి రిటర్నింగ్ అధికారులు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి మండలంలోని గ్రామ పంచాయతీలను క్లస్టర్లను ఏర్పాటు చేసి ఒక రిటర్నింగ్ అధికారినీ, సహాయ రిటర్నింగ్ అధికారిని నియమించామని తెలిపారు. రాష్ట్రఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకత్వా లు రిటర్నింగ్ అధికారుల కర దీపికలో సవివరంగా ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని దానికనుగుణంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ నియమావళి ప్రకారం ఎన్నికల నోటీసు ఇవ్వాలని, నామినేషన్ల పేపర్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారి కార్యాలయం నోటీసు బోర్డు పై స్వీకరించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాల జాబితా, స్వీయ ప్రకటన ప్రతులను ప్రచురించాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, ఏదేని నామినేషన్ పత్రాన్ని తిరస్కరించినచో దానికి గల కారణం తెలపాలని, నామినేషన్ పత్రాల జాబితా ప్రచురించాలని, అభ్యర్థుల ఉపసంహరణ నోటీసు స్వీకరించాలని, పోటీ చేయు జాబితా, గుర్తులు కేటాయింపు, ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడినప్పటి నుండి ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. ఏరోజుకారోజు టి పోల్ సాఫ్ట్వేర్ లో ఆర్ ఓ లు నివేదికలను ఎలక్షన్ ప్రాసెస్ మాడల్ ను ఉంచాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైన్లు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్, ఏంసి, కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ ఏర్పాటు

## ప్రారంభించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్

## కంట్రోల్ రూమ్ నెంబర్ - 9100817108




మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్ లను, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 24 గంటలు పని చేసే కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా మీడియా లో ఫేక్ న్యూస్ ప్రసారమైన, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన వెంటనే స్పందించాలని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదుల ఉంటే ప్రజలు కంట్రోల్ రూం నెంబర్ 9100817108

అందుబాటులో ఫోన్ చేసి చెప్పవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ వెంకటేశ్వర్లు,డిపిఓ హరిప్రసాద్, డిపిఓ పి.రాజేంద్ర ప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారులు స్వరూప, పుల్లారావు ఏంసిఏంసి సభ్యులు ఏం.ఏ.ఫిరోజ్, కె.రాము, సిబ్బంది విక్రమ్ తదితరులు ఉన్నారు.

# నిబంధనల ప్రకారం వ్యయ ప్రణాళికలు నిర్వహించాలి



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యయ ప్రణాళికలు నిర్వహించాలి, వ్యయ ప్రణాళిక నోడల్ అధికారి,డిసిఓ వెంకటేశ్వర్లు గ్రామపంచాయతీ ఎన్నికలలో ప్రభుత్వ నిబంధనలు ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం ఎన్నికల వ్యయ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలనిన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, మాస్టర్ ట్రేనర్స్ రామయ్య, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్,లతో కలిసి ఆయన ఖర్చుల ప్రణాళికపై శిక్షణ తరగతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహాయ వ్యయ అధికారులు, అకౌంటింగ్ టీం, వివిటి, విఎస్టి, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్టి, ఎంసిఏంసి, తదితర ఎన్నికల నిర్వహణకు సంబంధించి, ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం, ఆ పరిధిలోపే అభ్యర్థుల ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు.

# వరుస బస్సు ప్రమాదాలపై ఎన్‌హెచ్ఆర్సీ సీరియస్

### రూల్స్ ఉల్లంఘిస్తున్న స్లీపర్ బస్సులపై చర్యలు
### కీలక ఆదేశాలు జారీ చేసిన ఎన్‌హెచ్ఆర్సీ



న్యూ ఢిల్లీ, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఇటీవల వరుస బస్సు ప్రమాదాలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఇటీవల రాజస్థాన్ లోని జైసల్మేర్-జోథ్ పూర్ హైవేపై జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది, మృతి చెందగా ఏపీలోని కర్నూల్ జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు మంటల్లో చిక్కుకుని 20 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. ఈ ప్రమాదాలపై వచ్చిన ఫిర్యాదుల విషయంలో భారతీయ జాతీయ మానవ హక్కుల కమిషన్ ధర్మాసనం శనివారం అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. రూల్స్ కు విరుద్ధంగా నడుస్తున్న స్లీపర్ బస్సులను పక్కన పెట్టేయాలని ప్రియాంక్ కనూంగో నేతృత్వంతోని ఎన్‌హెచ్ఆర్సీ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలిచ్చింది. రాజస్థాన్ బస్సు అగ్ని ప్రమాదంపై జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేసాల మేరకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ చేసిన దర్యాప్తులో బస్సు AIS-052, AIS-119 అనే తప్పనిసరి భద్రతా ప్రమాణాలకు వ్యతిరేకంగా తయారు చేసినట్లు తేలింది. ఇందులో ఫైర్ డిటెక్షన్ మరియు సప్రెషన్ సిస్టమ్ లేకపోవడం, డ్రైవర్ క్యాబిన్ కు ప్రయాణికుల క్యాబిన్ కు పూర్తిగా మూసివేసి ఉండటం వల్ల వెనుక భాగంలో ఏం జరుగుతోందని డ్రైవర్ గుర్తించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని నివేదిక స్పష్టం చేసింది. అలాగే స్లీపర్ బెర్త్ లపై తప్పు స్లైడర్లు, సరిపడ ఎమర్జెన్సీ డోర్లు లేకపోవడం వంటి పెద్ద లోపాలను ఈ నివేదిక ఎత్తి చూపింది. దీంతో ఈ తప్పులు పూర్తిగా నివారించదగినవి అని పేర్కొన్న ఎన్‌హెచ్ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను పక్కన పెట్టేయాలని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

# ఎస్పీ బాలు విగ్రహావిష్కరణకు సీఎంకు ఆహ్వానం

### ముఖ్యమంత్రిని కలిసిన సినీ నటుడు శుభలేఖ సుధాకర్
### డిసెంబర్ 15న రవీంద్రభారతి ఆవరణలో విగ్రహావిష్కరణ



హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో ప్రముఖ గాయకుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయవలసిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్రభారతి ఆవరణలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరపున ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు డిసెంబర్ 15 న విగ్రహావిష్కరణకు రావాల్సిందిగా సీఎంని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నటుడికి శాలువా కప్పి సత్కరించారు. కాగా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రాంగణంలో ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పక్కన ఎస్పీ బాలు విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక, గాన గంధర్వుడు, స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషల్లో సుమారు 40 వేలకు పైగా పాటలు పాడి ఎంతో మంది అభిమానులను సంపాధించుకున్నారు. ఆయన 2020 సెప్టెంబర్ 25న అనారోగ్యంతో కన్నుమూశారు.

# శీతాకాల సమావేశాలకు ముందు అఖిల పక్ష సమావేశం

### సమావేశాల నిర్వహణకు సహకారం కోరిన కేంద్రం
### డిసెంబర్ 1 నుండి 19 వరకు కొనసాగనున్న సమావేశాలు



న్యూ ఢిల్లీ, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముందు ప్రభుత్వం నేడు న్యూఢిల్లీలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటు ఉభయ సభల రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమవుతారు. ఈ సమావేశంలో, లోక్‌సభ మరియు రాజ్యసభ సమావేశాలు సజావుగా జరిగేలా ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల సహకారం కోరుతుంది. న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఈరోజు శ్రీ రిజిజు మాట్లాడుతూ, అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీల అభిప్రాయాలను వింటుందని అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వచ్చే నెల 1వ తేదీ నుండి డిసెంబర్ 19 వరకు కొనసాగుతాయి. ఈ సమావేశాల్లో అనేక ముఖ్యమైన చట్టాలను చర్చకు, ఆమోదానికి తీసుకోనున్నారు

# కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

### రేవంత్ రెడ్డి పాలనలో దోపిడీ,కమీషన్లకే పెద్దపీట
### స్థానిక సంస్థల్లో గెలిచి అమరవీరుల ఆశయాలను నిజం చేయాలి
### డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ఆసిఫాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్,తెలంగాణ వచ్చుడో, కేసిఆర్ సచ్చుడో అన్న నినాదంతో ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనకాడలేదని, ఆ స్ఫూర్తితోనే మళ్లీ పోరాడి,తెలంగాణను కాపాడుకోవాలని కాంగ్రెస్ పాలకుల దోపిడీ నుండి కాపాడుకోవాలని డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. దీక్షా దివస్ సందర్భంగా ఈ రోజు ఆసిఫాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హాజరై,తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు,అనంతరం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడి, కమీషన్ల కోసం స్కాంలు చేసి ఆ సొమ్ము ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు. కొడంగల్ నారాయణపేట ప్రాజెక్టుకు 4 వేల కోట్లు,ఫ్యూచర్ సిటీకి 6 లైన్ల రోడ్డుకు 4 వేల కోట్లు కమీషన్ల కోసమే ప్రారంభించారన్నారు. అంతేకాకుండా 9292 ఎకరాల భూమిలో, 5 లక్షల కోట్ల భూస్కాం చేయడానికి హిల్ట్ పి ప్రాజెక్టు ప్రారంభిచారని తెలిపారు.

అందుకే ఈ దోపిడీ,కమీషన్ల ప్రభుత్వాన్ని ఓడించాలని అందుకే కేసిఆర్ ను స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి పాలనలో దోపిడీ,కమీషన్లకే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో 300 పైగా అమరవీరులు ఆత్మబలిదానం చేసుకున్నారని ఆనాడు కాంగ్రెస్ పాలకులు తెలంగాణ ఇస్తామని చెప్పి మోసం చేశారని గుర్తుచేశారు. ఆనాడు పోలీస్ అధికారిగా ఎంతో మంది అమరుల మృతదేహాలను మోసానని గుర్తు చేశారు. అమరులు తెలంగాణ రావాలని, ఇక్కడి ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నారన్నారు.

పదేళ్ల కేసిఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాళేశ్వరం నీళ్లు, కళ్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు, మెడికల్ కళాశాలలు, గురుకులాలు ఏర్పాటు చేసి వేలాది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తయారుచేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో పిల్లలకు తిండి లేక రోడ్ల మీదికి వచ్చి ధర్నా చేసే పరిస్థితి వచ్చిందన్నారు. విద్యార్థులు, రైతులు వందల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణను కేసిఆర్ కాళేశ్వరం కట్టించి, నీళ్లు ఇచ్చి బంగారు తెలంగాణగా మార్చి దేశంలోనే నెం.1 గా నిలబెట్టారన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డ బ్యారేజీ,లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను బాంబులు పెట్టి కూల్చేశారని, ఇసుక దందాల కోసం కాంగ్రెస్ నాయకులు బాంబులతో ఇరిగేషన్ బ్రిడ్జిలను కూల్చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తిరిగి దేశంలో నెం 1 రాష్ట్రంగా నిలబడాలంటే కేసిఆర్ ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అప్పుడే అమరవీరుల ఆశయాలు నెరవేరుతాయని స్పష్టం చేశారు.


# కేసీఆర్ ఆమరణ దీక్షకు 16 ఏండ్లు

### తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజు
### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



హన్మకొండ, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): దీక్షా దివాస్ సందర్భంగా హన్మకొండలోని కాలేజీ సెంటర్లో జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కాసేపు మౌనం వహించి అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కాళోజీ నారాయణ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ దీక్షా దివాస్ తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన చారిత్రక రోజు కెసిఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే పోరు రణ నినాదంతో తెలంగాణ స్వరాష్ట్రం కోసం 16 ఏళ్ల క్రితం ఉద్యమ నేత, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష దిగిన రోజు నేటి ఈ దీక్షా దివాస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తొలి విడత నామినేషన్ల పర్వం పూర్తి



హైదరాబాద్, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. గురువారం మొదలైన నామినేషన్ల స్వీకరణ శనివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా 31 జిల్లాల్లో 189 మండలాల్లో 4236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. నేడు నామినేషన్లను పరిశీంచి చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితాను అధికారులు రెడీ చేయనున్నారు. ఒక వేళ సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థి నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు అభ్యర్థి సంబంధిత రెవెన్యూ డివిజనల్, సబ్ కలెక్టర్ వద్ద రిటర్నింగ్ అధికారిపై డిసెంబర్ 31 వరకు అప్పీల్ చేసుకోవచ్చు. డిసెంబర్ 2న అప్పీళ్లను పరిష్కరిస్తారు. డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అభ్యర్థులు ప్రకటించి వారికి ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు ప్రచారంపై ఫోకస్ పెట్టారు. ఓటర్లను తమ వైపు ఆకర్శించేలా హామీలు ఇచ్చేందుకు ప్రథ్యర్థులతో పోటీ పడుతున్నారు.

**రేవంత్ రెడ్డి గ్రామం ఏకగ్రీవం:**

మొదటి విడత ఎన్నికలు జరగాల్సిన పంచాయతీలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఏకగ్రీవాల సందడి నెలకొంది. పలు గ్రామాల్లో సర్పంచ్□లు, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయింది. రేవంత్ రెడ్డి చిన్ననాటి మిత్రుడు, క్లాస్ మేట్ వెంకటయ్య సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వ్ కాగా మొత్తం 15మంది పోటీ పడ్డారు. ఈ క్రమంలో గ్రామపెద్దలు అంతా కలిసి సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేశారు.

**నేటి నుంచి రెండో విడత నామినేషన్లు:**

నేటి నుంచి రెండో విడత ఎన్నికల కోసం నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో నామినేషన్ల స్వీకరణకు డిసెంబర్ 2 వరకు తుది గడువు విధించారు. డిసెంబర్ 3వ తేదీన నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజున అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి వారికి ఎన్నికల గుర్తును కేటాయించనున్నారు. వచ్చే నెల 14న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితం ప్రకటిస్తారు.

# వాట్సాప్, టెలిగ్రామ్‌లకు కేంద్రం కీలక ఆదేశాలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 29 (తీన్మార్ న్యూస్): వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మెసేజింగ్ యాప్స్ కు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫోన్ లో సిమ్ కార్డ్ ఉంటేనే యాప్ పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ సూచించింది. తాజా ఆదేశాల ప్రకారం ఆయా సంస్థలు తదుపరి 90 రోజుల పాటు సిమ్ కార్డుతో అనుసంధానం అయ్యేలా చూసుకోవాలి. యూజర్ వెబ్ బ్రౌజర్ లో లాగిన్ అయినట్లు అయితే ప్రతి ఆరు గంటలకు ఒకసారి లాగ్ అవుట్ అయ్యేలా ఉండాలి. తిరిగి లాగిన్ అవ్వాలి అంటూ మళ్లీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంటుంది. టెలికమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగం అవ్వకుండా ఉండేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక ప్రస్తుతం యాప్ ఇన్ స్టాల్ చేసుకున్నప్పుడు ఫోన్ లో సిమ్ ఉండాలి. తరవాత సిమ్ కార్డ్ తీసేసినా, డియాక్టివేట్ చేసినా సేవలు కొనసాగుతున్నాయి. దీంతో సైబర్ నేరగాళ్లు యాప్స్ ను వినియోగిస్తున్నారు. అలా జరగకుండా ఉండేందుకు భద్రత కోసం సిమ్ కార్డ్ ఉంటేనే యాప్ పనిచేసేలా చూడాలని కేంద్రం ఆదేశించింది.



# మీరు ఈ పొరపాట్లు చేస్తున్నారా..?

## అయితే మీ ఎముకలు బలహీనంగా మారి విరిగిపోతాయి జాగ్రత్త..!



వయస్సు మీద పడే కొద్దీ ఎవరికైనా సరే సహజంగానే ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి బలహీనంగా మారుతాయి. శరీరంలో క్యాల్షియం తగ్గడంతోపాటు పలు ఇతర కారణాల వల్ల ఇలా ఎముకలు బలం కోల్పోతాయి. వృద్ధాప్యంలో ఎవరికైనా ఇలాగే జరుగుతుంది. అయితే ప్రస్తుతం చాలా మందికి యుక్త వయస్సులోనే ఎముకలు బలహీనంగా మారి విరిగిపోతున్నాయి. ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి పెళుసుగా మారుతున్నాయి. దీంతో శక్తి లేనట్లు ఫీలవుతున్నారు. బలంగా ఉండడం లేదు. చిన్నారుల్లో కూడా ఎదుగుదల సమస్యలు వస్తున్నాయి. అయితే ఇలా యుక్త వయస్సులోనే ఎముకలు బలహీనంగా మారకూడదు. అలా మారుతున్నాయంటే అందుకు చాలా బలమైన కారణాలే ఉంటాయి. ముఖ్యంగా కొందరు పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి వల్లే ఎముకలు అలా బలహీనంగా మారుతుంటాయి. కనుక పొరపాట్లు ఎలా, ఎక్కడ చేస్తున్నారో గమనించాల్సి ఉంటుంది.

**పొగ తాగడం..**

చాలా మంది ప్రస్తుతం యుక్త వయస్సులో ఉన్నవారు సైతం పొగ అధికంగా తాగుతున్నారు. స్మోకింగ్ అనేది యువతలో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తమ తోటి స్నేహితులు తాగుతున్నారని తాము కూడా పొగ తాగడం మొదలు పెడుతున్నారు. ఇలా వారు పొగ తాగడం వల్ల శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ అధికంగా ఉత్పత్తి అవుతాయి. ఇవి శరీరానికి అత్యంత హాని చేస్తాయి. క్యాల్షియం నిల్వలను తగ్గిస్తాయి. ఎముకలు బలహీనంగా మారేలా చేస్తాయి. దీంతో ఎముకల సాంద్రత సైతం తగ్గిపోతుంది. చివరకు ఎముకలు బలహీనంగా మారుతాయి. కనుక పొగ తాగడం మానేయాలి. యుక్త వయస్సులోని వారే కాదు, అసలు ఎవరూ కూడా పొగ తాగడం మంచిది కాదు. అది ఎముకలకు తీవ్రమైన హాని కలగజేస్తుంది.

**అధికంగా మద్యం సేవించడం..**

ప్రస్తుతం చాలా మంది కూర్చుని చేసే ఉద్యోగాలనే అధికంగా చేస్తున్నారు. రోజూ గంటల తరబడి కుర్చీల్లో కూర్చునే ఉంటున్నారు. దీని వల్ల శారీరక శ్రమ తగ్గుతోంది. ఫలితంగా ఎముకలు బలహీనంగా మారుతున్నాయి. కనుక ఇలాంటి వారు రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయాల్సి ఉంటుంది. కనీసం 30 నిమిషాల పాటు అయినా సరే వాకింగ్ చేయాలి. దీని వల్ల ఎముకలు బలహీనంగా మారకుండా ఆరోగ్యంగా ఉంటాయి. దృఢంగా ఉంటారు. ఇక రోజూ విపరీతంగా మద్యం సేవిస్తున్నా కూడా శరీరానికి మంచిది కాదు. ముఖ్యంగా దీని వల్ల ఎముకలపై ప్రభావం పడుతుంది. దీంతో క్యాల్షియం నిల్వలు తగ్గి ఎముకలు బలహీనంగా మరి సులభంగా విరిగిపోయే అవకాశాలు పెరుగుతాయి. అతిగా మద్యం సేవించే చాలా మంది చిన్న యాక్సిడెంట్ తరువాత ఎముకలు విరిగితే హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకున్నప్పటికీ కొంతకాలానికి ప్రాణాంతకంగా మారి చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కనుక మద్యం అతిగా సేవించకూడదు.

**ఉప్పు అధికంగా తినడం..**

ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలను చాలా మంది అధికంగా తింటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత ఇలాంటి ఆహారాలను అధికంగా తింటున్నారు. కనుక వారిలో ఎముకలు బలహీనంగా మారి సులభంగా విరిగిపోతున్నాయి. కనుక ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే ఉప్పు తీసుకోవడాన్ని తగ్గించాలి. లేదా పూర్తిగా మానేసి ప్రత్యామ్నాయ ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అలాగే చాలా మంది ఎముకల బలం కోసం క్యాల్షియం ఉండే ఆహారాలను తరచూ తీసుకుంటారు. కానీ దీంతోపాటు మన ఎముకల ఆరోగ్యానికి విటమిన్లు డి, కె కూడా అవసరమే. కనుక ఈ విటమిన్లు ఉండే ఆహారాలను తీసుకుంటేనే మన ఎముకలకు మేలు జరుగుతుంది. ఎముకలు బలహీనంగా మారకుండా దృఢంగా ఉంటాయి. సులభంగా విరిగిపోకుండా జాగ్రత్త పడవచ్చు. ఇలా ఆయా పొరపాట్లు జరగకుండా చూసుకుంటే ఎముకలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# మీ చేతి వేళ్ల గోర్లపై ఇలా తెల్లని మచ్చలు ఉన్నాయా..?

## అయితే ఏం జరుగుతుందో తెలుసా..?



మన శరీరంలో ఏవైనా వ్యాధులు వస్తే వెంటనే బయట పడవు. ముందుగా వాటి తాలూకు లక్షణాలు కొన్నింటిని శరీరం బయట పెడుతుంది. ఏ అనారోగ్య సమస్య వచ్చినా సరే ముందుగా మన శరీరం దాని లక్షణాలను మనకు తెలియజేస్తుంది. ఈ క్రమంలో ఆయా లక్షణాలను మనం ముందుగానే గుర్తిస్తే వ్యాధి తీవ్రత పెరగకుండా, ప్రాణాంతకం అవకుండా ముందుగానే చికిత్స తీసుకుని జాగ్రత్తగా ఉండవచ్చు. ఇక మన శరీరంలో పలు రకాల పోషకాల లోపం ఉన్నా కూడా శరీరం లక్షణాలను తెలియజేస్తుంది. కనుక ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యాధి నిర్ధారణకు రాకుండా ముందుగా డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని అవసరం అయితే అప్పుడు మందులను వాడాలి. అంతేకానీ సొంతంగా వైద్యం చేసుకోకూడదు. ఇక మన శరీరం తెలియజేసే అనేక లక్షణాల్లో చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు ఏర్పడడం కూడా ఒకటి. ఈ మచ్చలు ఏర్పడేందుకు పోషకాల లోపంతోపాటు పలు వ్యాధులు ఉండడం కూడా కారణాలు అవుతాయి. కనుక దేని వల్ల ఈ మచ్చలు ఏర్పడ్డాయో తెలుసుకోవడం మంచిది.

**మహిళలకు..**

చాలా మందికి అప్పుడప్పుడు చేతి వేళ్లకు చెందిన గోర్లపై తెల్లని మచ్చలు ఏర్పడుతుంటాయి. కొందరికి ఇవి మచ్చల్లా ఏర్పడితే కొందరికి తెల్లని గీతల్లా ఏర్పడుతాయి. అయితే ఎలా ఏర్పడినా ఈ మచ్చలు కనిపిస్తే మాత్రం అసలు నిర్లక్ష్యం చేయకూడదు. కొందరికి ఈ తెల్లని మచ్చలు చిన్నగా ఉంటే, కొందరికి వెడల్పుగా ఏర్పడుతాయి. అలాగే కొందరికి తక్కువ సంఖ్యలో తెల్లని మచ్చలు ఏర్పడితే, కొందరికి అధికంగా ఈ మచ్చలు కనిపిస్తాయి. చేతి వేళ్లకు చెందిన గోర్లపై ఇలా తెల్లని మచ్చలు లేదా గీతలు ఏర్పడడాన్ని లుకోనైకియా అంటారు. ఇది వాస్తవానికి అత్యంత సహజసిద్ధమైందిగా చెబుతారు. దీని గురించి అంత కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు అంటున్నారు. చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు ఏర్పడేందుకు అనేక కారణాలు ఉంటాయి. కొందరు నెయిల్ పెయింట్‌లను ఎక్కువగా వాడుతుంటారు. లేదా బ్యూటీ పార్లర్లలో గోర్లకు చికిత్స తీసుకుంటారు. ఇలా మహిళలు అధికంగా చేస్తారు. కనుక వారి గోర్లపై ఇలా తెల్లని మచ్చలు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారు పాటించే బ్యూటీ టిప్స్‌లో ఉపయోగించే రసాయనాలు పడకపోతే ఇలా జరుగుతుంది.

**ఇన్‌ఫెక్షన్లు ఉంటే..**

చేతి వేళ్ల గోర్లకు దెబ్బలు తగిలినా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు ఏర్పడినా అలా గోర్లపై తెల్లని మచ్చలు కనిపిస్తుంటాయి. కనుక మీకు దెబ్బలు తాకినా, గాయాలు అయినా లేదా ఇన్ ఫెక్షన్లు వచ్చినా అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో గోర్లపై ఉండే తెల్లని మచ్చలు సైతం వాటంతట అవే తొలగిపోతాయి. ఇక కొందరు మహిళలకు నెయిల్ పాలిష్‌లు పడవు. అలాంటి వారికి అలర్జీలు వస్తాయి. కనుక వారి గోర్లపై కూడా అప్పుడప్పుడు ఇలా తెల్లని మచ్చలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. అలాగే గుండె జబ్బులు ఉన్నవారికి, నోటి దుర్వాసన వస్తున్నవారికి, కిడ్నీలు ఫెయిల్ అయిన వారికి, సోరియాసిస్, ఎగ్జిమా, న్యుమోనియా వంటి వ్యాధులు ఉన్నవారికి కూడా చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు వస్తాయి.

**జింక్ లోపం ఉన్నా..**

కొన్ని సందర్భాల్లో మనం తినే ఆహారం ఫుడ్ పాయిజనింగ్ అవుతుంది. ఆర్సెనిక్ పాయిజనింగ్ గనక జరిగితే అప్పుడు కూడా ఇలాగే గోర్లపై తెల్లని మచ్చలు వస్తాయి. ఇక ఇవన్నీ కారణాలు కాకపోతే కచ్చితంగా జింక్ లోపించిందని అర్థం చేసుకోవాలి. జింక్ మన శరీరానికి కావల్సిన మినరల్స్‌లో ఒకటి. మన శరీరంలో జింక్ లోపం ఉన్నా లేదా జింక్ ను తగినంతగా తీసుకోకపోయినా ఇలా కొందరికి అప్పుడప్పుడు చేతి వేళ్ల గోర్లపై తెల్లని మచ్చలు వస్తుంటాయి. కనుక పైన చెప్పిన వ్యాధులు కారణాలు కాకపోతే అలాంటి వారు కచ్చితంగా జింక్ లోపం ఉందని గ్రహించాలి. వెంటనే జింక్ ఉండే ఆహారాలను తినాలి. జింక్ మనకు ఎక్కువగా చేపలు, రొయ్యలు, మటన్, కోడిగుడ్లు, పాలు, చీజ్, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా వంటి వాటిలో లభిస్తుంది. కనుక వీటిని తీసుకుంటే జింక్ సరిగ్గా లభిస్తుంది. అప్పుడు గోర్లపై ఉండే తెల్లని మచ్చలు సైతం తొలగిపోతాయి. కనుక ఈ సమస్యకు సరైన కారణం దొరికితే కచ్చితంగా పరిష్కారం లభిస్తుంది.




# డయాబెటిస్ వారికి ఎంతో మేలు చేసే పండ్లు ఇవే!

ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటిలో డయాబెటిస్ కూడా ఒకటి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు డయాబెటిస్‌కు కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే, డయాబెటిస్ ఉన్నవారు తరచుగా ఏం తినాలి, ఏవ తినకూడదు అనే దాని గురించి ఆందోళన చెందుతారు. అయితే, డయాబెటిస్ ఉన్న వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ పండ్లు షుగర్ లెవెల్స్‌ను కంట్రోల్ చేస్తాయని చెబుతున్నారు.

**సిట్రస్ పండ్లు:**

నిమ్మకాయలు, నారింజ, చిలగడదుంప వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. సిట్రస్ పండ్లలో అనేక ఇతర పోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వీటిలో చక్కెర చాలా తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వాటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ఉన్నవారు వాటిని వారి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు.

**రాస్ప్బెర్రీస్:**

రాస్ప్బెర్రీస్‌లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అవి మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో కూడా సమృద్ధిగా ఉంటాయి. రాస్ప్బెర్రీస్‌ను ప్రతిరోజూ తినడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వాటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇవి జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తాయని నిపుణులు అంటున్నారు.

**స్ట్రాబెర్రీలు:**

చాలా మంది కొంచెం తీపిగా, కొంచెం పుల్లగా ఉండే స్ట్రాబెర్రీలలో చక్కెర ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. 100 గ్రాముల స్ట్రాబెర్రీలలో 7 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు వాటిని నిస్సందేహంగా తినవచ్చని నిపుణులు అంటున్నారు.

**కివి:**


ఈ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తాయని నిపుణులు అంటున్నారు. 100 గ్రాముల కివి పండులో కేవలం 9 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది.

**అవకాడో:**

అవకాడోలో విటమిన్లు C, E, K, B ఉంటాయి. ఈ విటమిన్లు అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. ఇది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తుంది. సగం అవకాడోలో 0.66 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ అవకాడో తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

# ఊపిరితిత్తులను సహజంగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు..!

మన శరీరంలో ఊపిరితిత్తులు అనేవి అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ప్రస్తుత జీవనశైలిలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే పెరిగిపోతున్న కాలుష్యం, స్మోకింగ్ వంటివి ఊపిరితిత్తులను నాశనం చేస్తున్నాయి. కాబట్టి, ఊపిరితిత్తులను శుభ్రం చేస్తే, వాటి సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులను సహజంగా ఎలా క్లీన్ చేసుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..



**ఊపిరితిత్తులను ఇలా క్లీన్ చేయవచ్చు.. తులసి**

తులసి ఊపిరితిత్తులను సహజంగా శుభ్రపరచడంలో సహాయపడుతుంది. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం కలిగించడానికి సహాయపడతాయి. దీనిని తేనె, అల్లంతో కలిపి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వంటి సమస్యలకు కూడా ఉపశమనం లభిస్తుంది.

**అల్లం**

అల్లం కూడా ఊపిరితిత్తులను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలున్నాయి. ఇవి శ్వాసనాళాల నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడతాయి. అల్లం.. పొటాషియం, మెగ్నీషియం, బీటా-కెరోటిన్, జింక్ వంటి అనేక విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటుంది. అల్లంలోని యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసకోశంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా అల్లం నీరు తాగడం వల్ల ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**పసుపు**

పసుపులో ఉండే కర్కుమిన్ అనే సమ్మేళనం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మంటను తగ్గించి, శ్లేష్మం తొలగించడంలో సహాయపడుతుంది. పసుపు సహజంగా ఊపిరితిత్తులను శుభ్రపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఇది శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది, ఇది ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది. పసుపును మీరు ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీ ఊపిరితిత్తులు సహజంగా క్లీన్ అవుతాయని నిపుణులు అంటున్నారు.

# 9 ప్రపంచ రికార్డుల ముంగిట కోహ్లి



క్రికెట్ ప్రపంచంలో కింగ్ కోహ్లీగా ప్రఖ్యాతి గాంచిన విరాట్ కోహ్లీకి నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డే మ్యాచ్‌ల సౌతాఫ్రికా సిరీస్ చాలా కీలకం కానుంది. ఇది కోహ్లీకి కేవలం ఒక సాధారణ సిరీస్ కాదు, ఏకంగా తొమ్మిదికి పైగా అరుదైన ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకునే అద్భుతమైన అవకాశం. అత్యంత వేగంగా 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడం నుంచి, ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించడం వరకు... ఈ సిరీస్‌లో విరాట్ కొట్టే ప్రతి పరుగు చరిత్ర సృష్టించనుంది. విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో 51 సెంచరీలతో, టెస్టుల్లో 51 సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్ రికార్డుతో సమంగా ఉన్నాడు. ఈ సిరీస్‌లో విరాట్ కేవలం ఒక్క సెంచరీ సాధిస్తే, వన్డేల్లో 52 సెంచరీలు పూర్తి చేసుకుంటాడు. తద్వారా అతను ఏ ఒక్క ఫార్మాట్‌లో అయినా అత్యధిక సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలిచి, సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఈ అరుదైన రికార్డు కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కూడా కోహ్లీ ముందున్నాడు. విరాట్ 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడానికి 327 పరుగులు మాత్రమే అవసరం. రాబోయే 23 ఇన్నింగ్స్‌లలో విరాట్ ఈ పరుగులు చేస్తే, అత్యంత వేగంగా 28,000 పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశం ఉంది. అలాగే, ప్రస్తుతం విరాట్ ఖాతాలో 27,673 అంతర్జాతీయ పరుగులు ఉన్నాయి. అతను కేవలం 344 పరుగులు చేస్తే, శ్రీలంక దిగ్గజం కుమార సంగాక్కర (28,016 పరుగులు)ను అధిగమించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. ఈ సిరీస్‌లో విరాట్ సౌతాఫ్రికాపై, భారత గడ్డపై కూడా అనేక ప్రత్యేక రికార్డులు సాధించే అవకాశం ఉంది. కేవలం ఒక సెంచరీ సాధిస్తే, సౌతాఫ్రికాపై 6 వన్డే సెంచరీలు చేసిన ప్రపంచంలోనే ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. అలాగే, గెలిచిన మ్యాచ్‌లలో మరో 14 పరుగులు చేస్తే, సౌతాఫ్రికాపై భారత్ విజయాలలో 1000 వన్డే పరుగులు చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టిస్తాడు. SENA (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై గెలిచిన వన్డే మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డుకు కేవలం 16 పరుగుల దూరంలో మాత్రమే ఉన్నాడు. స్వదేశంలో ఒక 50ం స్కోరు సాధిస్తే, భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన రికార్డును సొంతం చేసుకుంటాడు. అంతేకాకుండా, ఒక హాఫ్ శతకం సాధిస్తే, దేశీయ మైదానాల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్న ఏకైక ఆటగాడిగా అరుదైన మైలురాయిని చేరుకుంటాడు.

# ఆయుష్ మాత్రే సిక్సర్ల వర్షం



2025-26 సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2025-26) లో భాగంగా జరిగిన ఎలైట్ గ్రూప్ %ూూ% మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై కేవలం 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ముంబై తరపున అద్వితీయ సెంచరీ చేసిన ఆయుష్ మాత్రే ఈ విజయానికి ప్రధాన రూపశిల్పి అయ్యాడు. మ్యాచ్ ప్రారంభంలో, టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించడం ద్వారా మంచి ఆరంభాన్ని ఇచ్చింది. అథర్వ టైడే 64 పరుగులు, అమన్ మొఖడే 61 పరుగులు సాధించారు. అయితే, ఈ ఇద్దరు ఆటగాళ్లు అవుట్ అయిన తర్వాత ఆరుగురు బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరును చేరుకోకపోవడంతో విదర్భ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఒకప్పుడు 200 కంటే ఎక్కువ స్కోరు చేసిన విదర్భ చివరికి 192 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ భారీ స్కోరును ఛేదించే క్రమంలో, 18 ఏళ్ల ఆయుష్ మాత్రే ముంబై తరపున చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్ మాత్రే కేవలం 53 బంతుల్లోనే అజేయంగా 110 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో, ఆయుష్ మాత్రే 8 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. అతను కేవలం ఫోర్ల ద్వారా 80 పరుగులు చేశాడు. ఆయుష్ మాత్రేతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా 30 బంతుల్లో 35 పరుగులు చేశాడు. అదే సమయంలో, శివమ్ దూబే 19 బంతుల్లో 205.26 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 39 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. శివమ్ దూబే కూడా 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. ఫలితంగా, ముంబై కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది.

# నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే

## రాంచీ వేదికగా జరగనున్న మొదటి మ్యాచ్

## వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోన్న భారత్





రాంచీ: టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడిపోయి దాదాపు అయిదారు దశాబ్దాల చెత్త రికార్డులను ఖాతాలో వేసుకున్న టీమిండియా వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతం గంభీర్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ కోసం రెండు జట్లు సిద్ధంగా ఉన్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 30, 2025న రాంచీ వేదికలో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. టెస్ట్ సిరీస్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని క్రికెట్ ప్రేమికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకు కారణంగా దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్ళు జట్టులో ఉన్నారు. కనుక వన్డే సిరీస్ కోసం అభిమానులు చూస్తున్నారు. పటిష్ట టీమిండియా వన్డే సిరీస్ లో సఫారీలపై నెగ్గుతారని సంకేతాలు కనిపిస్తున్నాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మొదటి వన్డే రాంచీలో స్టేడియం కాంప్లెక్స్‌లో ఆదివారం నాడు జరగనుంది. అయితే స్టేడియానికి వెళ్లి చూడలేని వారు హాయిగా ఇంట్లో కూర్చుని లైవ్ స్ట్రీమింగ్, టీవీ ప్రసార ఆప్షన్లు ఉన్నాయి. వాటి గురించి క్రికెట్ అభిమానులు తెలుసుకోవాలి. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రాణించిన సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. దీంతో అభిమానుల చూపులన్నీ వాళ్లపైనే ఉండనున్నాయి. ఈ ఇద్దరూ బ్యాటింగ్‌లో రాణిస్తే, జట్టుకు భారీ స్కోర్ ఖాయం. సౌతాఫ్రికాపై విరాట్ గత రికార్డులు బాగుండడం, రోహిత్ శర్మ భీకర ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశాలు. ఇక రెగ్యులర్ కెప్టెన్ శుభమన్ గిల్, శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమయ్యారు. మహమ్మద్ షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో భారత్ వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న సౌతాఫ్రికాను భారత యువ పేసర్లు ఏ మేరకు కట్టడి చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కెప్టెన్ గిల్ గైర్హాజరులో సీనియర్ ఆటగాడు KL రాహుల్ జట్టును నడిపించనున్నాడు. రోహిత్‌కుతో యశస్వీ జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. తర్వాత విరాట్ రానున్నాడు. తిలక్ వర్మ, రిషభ్ పంత్, KL రాహుల్‌తో పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ ఉంది. మరో సీనియర్ రవీంద్ర జడేజాకు తుది జట్టులో చోటు ఖాయం కాగా, అతడికి తోడు మరో ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిని ఎంచుకునే అవకాశం ఉంది. వన్డేలేలో కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ రికార్డ్ మెరుగ్గానే ఉంది. ఇప్పటిదాకా 12 మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియాకు రాహుల్ నాయకత్వం వహించాడు. అందులో 8 వన్డేల్లో భారత్ గెలిచింది. మరో నాలుగింట్లో ఓడింది. ఓవరాల్‌గా విన్నింగ్ పర్సెంటేజీ 67 శాతంగా ఉంది.

సీనియర్లకు లేకపోవడంతో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణకు తొలి వన్డేలో ఛాన్స్ దక్కే ఛాన్స్ ఉంది. మరి ఈ యువ ఆటగాళ్లు అనుభవజ్ఞులైన సఫారీ బ్యాటర్లకు ఎలా కళ్లెం వేస్తారో చూడాలి. ఒకరకంగా చెప్పాలంటే ఈ పేస్ త్రయానికి మాత్రం సౌతాఫ్రికా సిరీస్ కఠిన పరీక్ష కానుంది. టెస్టు సిరీస్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న సఫారీలు వన్డే సిరీస్‌లోనూ సత్తాచాటాలని పట్టుదలతో ఉన్నారు. కెప్టెన్ బవుమా, మార్క్రమ్, రికిల్‌టన్, డికాక్, డేవిడ్ బ్రెవిస్, బ్రీట్జ్‌కేలతో బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది. కార్బిన్ బాష్, మార్కో యాన్సెన్ వంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉండగా స్పిన్ భారం కేశవ్ మహారాజ్ మోయనున్నాడు. స్టార్ పేసర్లు రబాడా, నోకియా దూరమైన నేపథ్యంలో ఎంగిడి నేతృత్వంలోని బౌలింగ్ దళం ఎంతమేర రాణిస్తోందో చూడాలి. నెమ్మదిగా ఉండే రాంచీ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం లేదు. టాస్ గెలిచిన జట్టు తొలుత బౌలింగ్ తీసుకునే అవకాశం ఉంది. కాగా టీమిండియా, దక్షిణాఫ్రికా మధ్య రాంచీ వేదికగా జరగనున్న మొదటి వన్డే మ్యాచ్ జియోహాట్‌స్టార్ యాప్, జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎప్పటిలాగే, మ్యాచ్‌ని చూడటానికి అభిమానులు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కలిగి ఉండాలి. టీవీలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్ లైవ్ చూడవచ్చు. టాస్ ఆట ప్రారంభానికి 30 నిమిషాల ముందు, అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు. టాస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా జట్ల ప్లేయింగ్ %ఠ×% ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు డే అండ్ నైట్ వన్డే ప్రారంభం కానుంది. వాస్తవానికి భారత్‌లో సిరీస్ కనుక ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు మ్యాచ్ ఉంటుందని ఆశించిన ఫ్యాన్సుకు నిరాశే ఎదురవుతోంది.

**భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్: పూర్తి స్క్వాడ్‌లు**

భారత్ పూర్తి ఆటగాళ్లు- రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (కెప్టెన్), తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్

దక్షిణాఫ్రికా పూర్తి ఆటగాళ్లు - టెంబా బావుమా (కెప్టెన్), ఒట్నీల్ బార్ట్‌మన్, మాథ్యూ బ్రీట్జ్‌కే, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రమ్, కార్బిన్ బోష్, డెవాల్డ్ బ్రెవిస్, నాంద్రే బర్గర్, క్వింటన్ డి కాక్, రూబిన్ హెర్మన్, కేశవ్ మహారాజ్, టోనీ డి జోర్జీ, మార్కో జాన్సెన్, లుంగి ఎంగిడి, ప్రెనెలాన్ సుబ్రాయెన్

# టీమిండియాలో ద్రవిడ్, లక్ష్మణ్‌లాంటి బ్యాటర్లు లేరు

**క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం లేదు**
**క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు**



ప్రస్తుత భారత జట్టులో రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లాంటి స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లు లేరని క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అన్నాడు. టీ20, వన్డేలు ఎక్కువగా ఆడటంతో క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం భారత బ్యాటర్లకు లేకుండా పోయిందని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత్ జట్టు సంధి దశలో ఉంది. తాజాగా భారత జట్టు ప్రదర్శనపై స్పందించిన కపిల్ దేవ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'ప్రస్తుతం భారత ఆటగాళ్లు ఎక్కువగా టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఆడుతున్నారు. దాంతో బ్యాటర్లకు బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆడే అవకాశం రావడం లేదు. స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు చాలా ఓపికగా ఆడాలి. అలాగే ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం మన దగ్గర క్రీజులో పాతుకుపోయే రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి స్పెషలిస్ట్ బ్యాటర్లు లేరు. టెస్ట్‌ల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమే. స్పిన్, పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రత్యేకమైన నైపుణ్యం ఉండాలి. కానీ టర్న్, బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లపై బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. ఈ తరహా పిచ్‌లపై ఫుట్‌వర్క్ చాలా కీలకం. కానీ రిషభ్ పంత్ శైలి వేరు. ఎందుకంటే దూకుడుగా ఆడటమే అతని స్టైల్. రిషభ్ పంత్‌ను డిఫెన్స్ ఆడమని మనం చెప్పలేం. ఎందుకంటే పంత్ సిక్స్‌లు, ఫోర్లతో ఎదురువిరుచుకుపడి, ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల సమర్థుడు. అలాంటి నైపుణ్యమున్న అతనికి మనం నెమ్మదిగా ఆడి 100 బంతుల్లో 20 పరుగులు చేయమని చెప్పలేం. అతను అలా చేయలేడు కూడా'అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు.

# స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసిన ముంబై ఇండియన్స్

## మహిళా ప్రీమియర్ లీగ్ కోసం భారీ కసరత్తు

రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, మహిళా ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ-యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు. వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. "నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది" అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ్‌లను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.




# ఓటిటి వేదికగా శివ విడుదల చేస్తాం: నాగ్

ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. అందరూ చూసి ఎంజాయ్ చేయాలనే తపనతోనే ఓటీటీలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సినిమాలను 4కే లోకి ఎలా మార్చాలో అర్థమైంది. ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పని సులభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు. అలాగే అఖిల్ తదుపరి చిత్రం 'లెనిన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.



## ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

**ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్**



ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.




## వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దుమణిగింది.

## స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?


ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## అప్పులు తీర్చిన ఆపద్బాంధవుడు శ్రీవిష్ణు

**దర్శకుడు వేణు వుడుగుల ఎమోషన్**



తెలంగాణ నేపథ్యంలో వాస్తవిక అంశాలతో కూడిన సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వారిలలో వేణు వుడుగుల ఒకరు. నీది నాది ఒకే కథ(2018), విరాట పర్వం ఇలా తీసింది రెండు చిత్రాలే అయిన మంచి దర్శకుడిగా స్థానాన్ని నిలుపుకున్నాడు. తాజాగా అతడి నిర్మాణంలో వచ్చిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. తన మొదటి సినిమా హీరో శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుని ఇటీవల భావోద్వేగానికి లోనయ్యారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా వేణు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'నీది నాది ఒకే కథ' (2018). ఈ సినిమా సమయంలో తన ఆర్థిక ఇబ్బందుల గురించి వేణు తాజాగా మాట్లాడుతూ.. నా మొదటి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు, నేను కొన్ని తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాను. అప్పులు చాలా ఉండేవి. ఒకరోజు నన్ను శ్రీవిష్ణు చూసి ఎందుకు మీరు ఇలా ఉంటారు ఎప్పుడు ఏదో బాధతో అని అడిగాడు. ఏమైన అప్పులు ఉన్నాయా అంటూ తెలుసుకున్నాడు. నేను కూడా చిన్న చిన్నవే అంటూ చెప్పాను. దీంతో నా పరిస్థితి తెలుసుకున్న శ్రీ విష్ణు ఆ మరుసటిరోజే నాకున్న అప్పులన్నీ తీర్చేశాడు. ఆయనకు ఏం అవసరం ఇది చేయడానికి.. అయిన కూడా చేశాడు. ఆరోజు శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నా సినిమాకు కేవలం హీరో మాత్రమే కాదు, నా కష్టకాలంలో నాకు అండగా నిలబడిన ఒక దైవంగా



## దుమ్మురేపుతున్న ..పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. పల్లె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది. మదన్ కే సంగీతం అందించాడు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463